17052025-DIS-04_Layout 1 5/17/2025 3:56 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

అణ్వస్త్రాలు.. అట్టికత్తులు కావు!

గుమ్మడిదల రంగారావు

పహల్గాం మారణహోమం అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ ఉద్రిక్తత సమయంలో పాకిస్థాన్ అనాలోచితంగా అణ్వస్త్రాల ప్రస్తావన తెరపైకి తేవడం కూడా తెలిసిందే. పాకిస్థాన్ అణ్వస్త్రాల ప్రస్తావన తేవడం చాలా ఆశ్చర్యం, ఆందోళన కలిగించవలసిన విషయం. పాకిస్థాన్, భారత్ వద్ద అణ్వస్త్రాలున్న సంగతి ప్రపంచానికి తెలుసు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అణ్వాయుధాల ప్రస్తావన తేవడం ఆషామాషీ వ్యవహారం కాదు.

> అణ్వస్త్రాలున్న రెండు పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ ఆ ఆయుధాల ప్రస్తావన తేవటం అంటే ఆ ఆయుధాలను వాడతామని చెప్పటమే కదా! అటువంటి ఆలోచనే విస్మయం కలిగించే విషయం. ఇది అత్యంత బాధ్యతారహితమైన ఆలోచన. ఎందుకంటే అణ్వాయుధాలను ప్రయోగించి యుద్ధం చేస్తే గెలిచేవారు ఉండరు. యుద్ధాలు గెలవాలనే చేస్తారు ఎవరైనా. యుద్ధం ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాలేదు చరిత్రలో. యుద్ధంలో గెలుపు మరో కొత్త సమస్యకు పురుడు పొయ్యటం మనకు తెలుసు. అయినా యుద్ధం చెయ్యటం మానుకోలేకపోతున్నారు మనిషి. అణ్వాయుధాలను వాడితే గెలుపు అనేది ఉండదు. మనకు పాకిస్థాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో విజ్ఞులైన నమస్తే తెలంగాణ పాఠకులకు, సామాన్య ప్రజలకు అణ్వాయుధాల మీద అవగాహన కలిగించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

అణ్వస్త్రాల గురించి తెలుసుకోవాలంటే ముందు ఎన్‌పీటీ అనే దాన్ని గురించి అర్థం చేసుకోవాలి. అణ్వస్త్రాల విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఇది అత్యంత కీలకమైన అంశం. ఎన్‌పీటీ అంటే న్యూక్లియర్ నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ. అంటే అణ్వస్త్రాల వ్యాప్తి నిరోధక ఒప్పందం. అణ్వస్త్రాలకు సంబంధించిన సాహిత్యం అంతా ఆంగ్లంలో ఉన్నది. పదజాలం కూడా ఎక్కువగా ఆంగ్లంలోనే ఉంది. వీలైనంత వరకు తెలుగులోకి మార్చి చెప్తాను. ఎన్‌పీటీ అనేది చాలా మంది విని ఉంటారు, అందులో ఏముందో లోతుగా తెలియకపోయినా. ఇక్కడ ఎన్‌పీటీని లోతుగా పరిశీలిద్దాం. 1968లో ఈ ఎన్‌పీటీ ఒప్పందానికి ప్రపంచదేశాలు సంతకం చేసి ఆమోదం తెలిపే ప్రక్రియ మొదలైంది. ఈ ఒప్పందం 1970 మార్చి 5వ తేదీన అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం 1967 జనవరి 1కి ముందు అణు విస్ఫోటనం చేసిన దేశాలు అణ్వస్త్ర దేశాలుగా గుర్తింపు పొందాయి. వాటిని న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అంటే అణ్వస్త్రాలు కలిగిన రాజ్యాలు అంటారు. మిగిలిన దేశాలను నాన్ న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అనగా అణ్వస్త్రాలు లేని రాజ్యాలుగా పరిగణిస్తారు. మిగతా దేశాలు ఏవైనా 1967 తర్వాత అణ్వస్త్రాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఆ దేశాలను ఈ ఒప్పందం అణ్వస్త్రాలు ఉన్న దేశాలుగా గుర్తించదు. భారత్, పాకిస్థాన్ లాంటి దేశాలు ఈ కోవకే వస్తాయి. ఇదో రకమైన న్యూక్లియర్ ఫ్యూడలిజం.

> న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అన్న గుర్తింపు పొందిన దేశాలు ఐదు మాత్రమే. అవి అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా. విచిత్రం ఏమంటే ఈ ఐదు దేశాలు ఐరాసలోని అతి కీలకమైన భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలే.

ఎందుకు విచిత్రమో కొద్దిసేపు తర్వాత వివరిస్తాను. 1967 తర్వాత అణు విస్ఫోటనం చేసిన దేశాలను అణ్వస్త్ర దేశాలుగా ఈ ఎన్‌పీటీ ఒప్పందం గుర్తించదు. అణ్వస్త్రాలకు సంబంధించి అత్యంత కీలకమైన ఒడంబడిక పత్రం ఇది. ఈ ఒప్పందానికి దాదాపు 200 దేశాలు సంతకాలు చేశాయి. అంటే ఒప్పంద నియమాలను పాటించటానికి అంగీకరించాయి. 1970 తర్వాత అణు విస్ఫోటనం చేసి అణ్వాయుధాలు తయారు చేసినట్టు గుర్తింపు పొందిన దేశాలు కొన్ని ఉన్నాయి. అటువంటి దేశాల్లో భారత్, పాకిస్థాన్ ముఖ్యమైనవి. భారత్ పాకిస్థాన్ ఎన్‌పీటీ ఒప్పందాన్ని వ్యతిరేకించాయి. ఎందుకంటే 1970 తర్వాత విస్ఫోటనం చేసిన దేశాలను అణ్వస్త్ర దేశాలుగా ఈ ఒప్పందం గుర్తించదు. అలా గుర్తింపు పొందిన ఐదు దేశాలకు ఉండే సదుపాయాలు, మినహాయింపులు ఈ దేశాలకు ఉండవు. అందుకే ఎన్‌పీటీ వివక్షతో కూడుకున్న ఒప్పంద పత్రం అని ముఖ్యంగా భారత్ వాదన. ఎన్‌పీటీ ఒప్పందం మీద సంతకం చెయ్యటమంటే మనకున్న అణ్వస్త్రాలను నిర్వీర్యం చేసి మన ఆయుధాగారాలను అంతర్జాతీయ పరిశీలనకు తెరిచి ఉంచాలి. ఈ నిబంధన అణ్వస్త్ర దేశాలుగా గుర్తింపు పొందిన ఐదు దేశాలకు వర్తించదు. 1967కి ముందు విస్ఫోటనం చేసిన దానికి ఉన్న పవిత్రత ఏమిటీ, ఆ తర్వాత విస్ఫోటనం జరిపిన దేశాలు చేసిన పాపం ఏమిటనేది ఈ ఒడంబడికకు ఉన్న ముఖ్యమైన బలహీనత. కడుపునిండా చద్దన్నం తిన్న అమ్మకు ఇతరుల ఆకలి ఏమి తెలుస్తుందన్న సామెత గుర్తుకు వస్తుంది ఈ ఒడంబడిక పదజాలం చూస్తుంటే. అణ్వస్త్రాలు కలిగిన ఐదు దేశాలను ఇంతకుముందు విచిత్రం అనుకున్నాం కదా. ఎందుకు విచిత్రం అంటే భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు ఐరాస ఆశయాల సాధనలో ముఖ్య భూమిక పోషించాలి. ఏమిటి ఆ ముఖ్య భూమిక అంటే? సభ్యదేశాల మధ్య యుద్ధాలను నిరోధించటం, శాంతిని స్థాపించటం.

> కోల్డ్‌వార్ యుగంలో నాటో అన్న పేరుతో అమెరికా ఒకవైపు, వార్సా ప్యాక్ట్ అన్న పేరుతో అలనాటి సోవియెట్ యూనియన్ మరోవైపు ప్రపంచాన్ని అల్లకల్లోలానికి గురిచేశాయి. తద్వారా అనేక దేశాలు ఆయుధాలు ఏర్పాటు చేసుకునే పోటీ వాతావరణానికి శ్రీకారం చుట్టాయి. దెయ్యాలు వేదాలు వల్లించటం అంటే ఇదే కదా!

ఎన్‌పీటీలో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. అవి: ఆయుధాల వ్యాప్తిని అరికట్టడం, నిరాయుధీకరణ, అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకోవటం. ఒడంబడికలో ఉన్న ఆశయాలేవీ నెరవేరలేదు 55 ఏండ్ల తర్వాత కూడా. అంటే మన దేశంలో వరకట్న నిరోధక చట్టం లాంటిది ఈ ఎన్‌పీటీ ఒడంబడిక! భారత్, పాకిస్థాన్ ఈ ఒడంబడికను అంగీకరించలేదు గనుక ఇందులోని నిబంధనలు ఈ దేశాలకు వర్తించవు. అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించవలసినది ఏమంటే అణ్వస్త్రాలు భద్రత కోసం కన్నా కూడా భయం కలిగించటానికి ఏర్పాటు చేసుకోవటమనే విషయం. నా వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయి. నా జోలికి వచ్చావంటే జాగ్రత్త అనేది ఇక్కడ సూత్రం. అంటే, ఇవి నాకు బలాన్నివ్వవు. కానీ, నేనంటే భయాన్ని కొల్పుతాయన్నమాట. మరి రెండు పొరుగు దేశాలైన భారత్-పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నప్పుడు ఒకరిని చూసి మరొకరు జాగ్రత్తగా ఉండాలి కదా! కానీ, పాకిస్థాన్ పసిపిల్లాడి మాదిరిగా మా దగ్గర అణ్వాయుధాలు ఉన్నవని అదేపనిగా అరవటం దేనికి సంకేతం? మేము ఆ ఆయుధాలను వాడటానికి వెనకాడమని చెప్పటమే కదా! మరి భారత్ వద్ద కూడా ఉన్నవి కదా! పాకిస్థాన్ కంటే భారత్ వద్దే ఎక్కువ ఉంటాయి కదా అణ్వాయుధాలు. మరి భారత్‌ను బెదిరించటం ఏమిటి? ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమంటే భారత్ ఎప్పుడూ అణ్వస్త్రాల ప్రస్తావన తీసుకురాదు. అందరూ అంగీకరించే విషయాన్ని నిరూపించవలసిన అవసరం ఏమున్నది?

> ఇక్కడ అణ్వాయుధాల పట్ల భారత్ వైఖరిని గురించి తెలుసుకోవాలి. ఈ విషయంలో భారత్ ఒక స్వీయ నియంత్రణ సిద్ధాంతాన్ని (న్యూక్లియర్ డాక్ట్రిన్) ఏర్పాటుచేసుకున్నది. అందులోని ముఖ్యమైన అంశం నాన్ ఫస్ట్ యూజ్. అంటే, మొదటగా మేము అణ్వస్త్రాలను యుద్ధంలో ప్రయోగించబోమనేది భారత్ విధానం.

ఎవరైనా మా మీద ప్రయోగిస్తే తిరిగి మా అణ్వాయుధాలను ప్రయోగించటానికి వెనకాడం. కానీ, మేము మాత్రం మొదటగా ప్రయోగించబోమనేది మొదటి సూత్రం. రెండవది అణ్వస్త్రాలు లేని దేశం మీద అణ్వస్త్రాలను ప్రయోగించం అనేది. ఇంతకు మించిన స్వీయ నియంత్రణ ఏముంటుంది? ఇది అత్యంత బాధ్యతాయుతమైన అణు ప్రవర్తన అనటంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. మన అణ్వస్త్ర ధర్మాన్ని రూపొందించింది కె.సుబ్రహ్మణ్యన్ అనే అణ్వస్త్ర వ్యూహ కర్త. ఆయన కుమారుడే నేటి మన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్!

ఒక్క మాటలో చెప్పాలంటే ఏ దేశానికైనా అణ్వాయుధాలు ఇతరులు మనజోలికి రాకుండా భయపెట్టే సాధనమే గానీ మనకు భద్రత కల్పించే వ్యవస్థ కాదు. దీన్నే దౌత్య భాషలో డిటరెన్స్ అంటారు. అంటే మనకు ఉత్సాహాన్ని పెంచేదానికన్నా ఇతరులను నిరుత్సాహపరచటం అన్న మాట. కానీ, పాకిస్థాన్ ఈ డిటరెన్స్ అన్న మాటను అర్థం చేసుకోకుండా కోతికి కొబ్బరికాయ దొరికినట్టు, పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టు మాటిమాటికీ భారత్‌ను అణ్వస్త్రాలతో బెదిరించటం హాస్యాస్పదంగా ఉన్నది. భారత్ దగ్గర ఉన్న అణ్వాయుధాలు దీపావళి పండుగ చేసుకోవటానికి కాదు గదా! ఇక్కడ వాస్తవం ఏమంటే అణ్వస్త్రాలు ఎవరు ముందువాడినా, ఎవరు తర్వాత వాడినా, ఎవరూ మిగిలి ఉండరు. అణ్వస్త్రాలు 1945లో మొదటిసారి జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి మీద ప్రయోగించినప్పుడు, అవి చాలా పరిమిత శక్తి కలిగిన ఆటంబాంబులు. 1945లో వాడిన 'చిన్న బాలుడు', 'దొడ్డ మనిషి' అన్న పేర్లు ఉన్న ఆటంబాంబుల విధ్వంసం హిరోషిమా నాగసాకి నగరాలు వాటి చుట్టుపక్కల ప్రాంతాలకు పరిమితమైనది. కానీ, 1945 తర్వాతి కాలంలో అణ్వస్త్రాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినది. నేటి అణ్వస్త్రాలు'చిన్న బాలుడు, దొడ్డ మనిషి' కన్నా చాలా శక్తివంతమైన ఆయుధాలు. ఈ ఆయుధాలను ప్రయోగిస్తే గెలిచేవారుండరు. ఇరువైపులా ఊహించలేనంత వినాశనమే. మ్యూచువల్ అష్యూర్డ్ డిస్ట్రక్షన్ (MAD) అంటారు న్యూక్లియర్ పరిభాషలో. అంతటి వినాశన శక్తి కలిగిన ఆయుధాలు మావద్ద ఉన్నవని పాకిస్థాన్ అదే పనిగా అరవటం తాటాకు చప్పుడు లేక తెగింపునకు నిదర్శనమా? ఇటువంటి బాధ్యతా రాహిత్య ప్రవర్తనను ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలి. ఈ విషయం మీద నెలకొన్న నిశ్శబ్దాన్ని చూస్తుంటే ముక్తకంఠంతో పాకిస్థాన్‌ను ఖండించటానికి ప్రపంచం సిద్ధమా? అనేది సందేహమే. అది నిజంగా ప్రపంచం మొత్తానికి పట్టిన దురదృష్టం. ■

> ఏ దేశానికైనా అణ్వాయుధాలు ఇతరులు మన జోలికి రాకుండా భయపెట్టే సాధనమే గానీ మనకు భద్రత కల్పించే వ్యవస్థ కాదు. దీన్నే దౌత్య భాషలో డిటరెన్స్ అంటారు. అంటే మనకు ఉత్సాహాన్ని పెంచే దానికన్నా ఇతరులను నిరుత్సాహపరచటం అన్న మాట. కానీ, పాకిస్థాన్ ఈ మాటను అర్థం చేసుకోకుండా పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టు మాటిమాటికీ భారత్‌ను అణ్వస్త్రాలతో బెదిరించటం హాస్యాస్పదం.

పులి రాజు
99083 83567

రైతు రాజీనామా!

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో తన కష్టానికి తానే వెలకట్టుకునే (పంటలకు ధరలు) స్వతంత్రం రాని ఒకే ఒక వ్యక్తి రైతు. ఆదాయ భద్రత లేని ఏకైక రంగం వ్యవసాయం. వ్యవసాయదారుడు అంటేనే సమాజంలో ఒక చిన్న చూపు. ఆదాయం మాట పక్కనబెడితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాక, అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులను చూసి నేటి యువతరం వ్యవసాయం చేయడానికి ముందుకురావడం లేదు. ఇప్పటికే సాగు చేస్తున్న యువతరం వ్యవసాయాన్ని వదిలి వేరే ఉపాధి మార్గాన్ని వెతుక్కుంటున్నది.

ఇప్పటికే వ్యవసాయానికి అత్యంత ప్రధానమైన నాగలి, ఎడ్లు, గొర్రు, కొడవలి లాంటివి ఇప్పటి తరానికి తెలవకుండా పోయింది! భవిష్యత్తులో ఆ పరికరాలను, రైతులను మ్యూజియంలో చూసే పరిస్థితి వచ్చేటట్టు ఉంది. భారత వ్యవసాయం సంక్షోభంలో లేదు, రైతు మాత్రమే సంక్షోభంలో ఉన్నాడు. మన దేశంలో ప్రతి అర్ధగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ప్రతిరోజు సుమారు 2-3 వేల మంది రైతులు వ్యవసాయరంగాన్ని వదిలి ఇతర రంగాలకు వెళ్లిపోతున్నారు. ఇంకా 40 శాతం మంది రైతులు తమకు ఇష్టం లేకున్నా, నష్టాలను మూటగట్టుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, సొంతూరిని వదిలిపెట్టి బయటికిపోలేక సాగు చేస్తున్నారు.

> ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం.. మన దేశంలో 1995-2022 వరకు 3,97,540 మంది రైతులు, తెలంగాణలో 33,325 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి అధికారిక గణాంకాలు. 2023- 2024 సంవత్సరాల గణాంకాలను ఎన్సీఆర్బీ ఇంకా విడుదల చేయలేదు. ఈ ఆత్మహత్యల గణాంకాల్లో కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు లెక్కలోకి రారు. ప్రభుత్వ లెక్కలకు అందని రైతుల ఆత్మహత్యలు ఇంకా ఎన్ని ఉన్నాయో ఒక్కసారి ఆలోచించండి.

దేశ జనాభాకు సరిపోయే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ రంగం బాగానే ఉంది. కానీ, ఆ ఉత్పత్తికి మూల కారణమైన వ్యవసాయదారుడు మాత్రం రోజు రోజుకు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నాడు. అందుకే దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల పరంపరను మనం నిత్యం చూస్తున్నాం. భూమి అనేది ఆకలి తీర్చే కన్న తల్లి లాంటిది. ఆ భూమి భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపద! కానీ, ఇప్పుడు తెలంగాణలో భూములు రైతుల చేతుల్లో నుంచి ఇటు ఆ గ్రామస్థులు కాని, అటు రైతులు కాని వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పట్టాదారు పాస్‌బుక్ ఉంటేనే రైతు అని ప్రభుత్వాలు చెప్పు



న్నాయి. ఒకప్పుడు భూమి అంటే పంటలు పండించే ఒక ప్రధాన సాధనం, ఒక బతుకుదెరువు, ఒక కుటుంబానికి వారసత్వ సంపద, ఒక భరోసా! ఆ గ్రామస్థుల ఆస్తి కాని భూమి అంటే పంటలు పండించే సాధనం కాదన్నట్టే. భూమి అంటే సామాజిక హోదాకు ప్రతిరూపం. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రైతు బీమా, రైతు బంధు/రైతు భరోసా, పన్నుల మినహాయింపు లాంటి పథకాలను ఉపయోగించుకోవడాకి ఐదు గుంటల నుంచి వందల ఎకరాల వరకు చాలామంది ఉద్యోగులు, వ్యాపారులు భూములను కొనుగోలు చేస్తున్నారు. 'మాకు భూమి ఉంది' అని చెప్పుకొని గర్వపడుతున్నారు.

ఇవాళ తెలంగాణలో రైతుల చేతుల్లో భూమి లేదు. భూమి పట్టా ఉన్నవారు రైతులు కారు. తెలంగాణలో భూమి పట్టాదారుల సంఖ్య 2018-19లో 50,23,861ఉండగా.. 2024-25లో 70,60,000కు చేరింది. పట్టాదారులు పెరుగుతున్నారు కానీ, రైతులు తగ్గుతున్నారు. భూమి ఉంటుంది కానీ, ఆ కుటుంబం వ్యవసాయం చేయదు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామంలో ఆ గ్రామస్థులకు 1,133 ఎకరాలుంటే ఇతరులకు 1,203 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇదొక ఉదాహరణ మాత్రమే. వ్యవసాయం చేసే యువకులకు పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకురావడం లేదంటే అతిశయోక్తి కాదు. నేటి యువతరం సెక్యూరిటీ గార్డుగానైనా పని చేయడానికి సిద్ధపడుతున్నారు కానీ, వ్యవసాయం చేయడానికి ఇష్టపడటం లేదు.

రైతు రాజీనామా చేస్తే భారతదేశానికి భవిష్యత్తు లేదు. భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడే ప్రమాదమున్నది. కాబట్టి రైతును గౌరవిద్దాం! అన్నదాతను కాపాడుకుందాం!! రైతు ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మించుకుందాం.

(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)

యువతరాన్ని వ్యవసాయం వైపు మళ్లించేందుకు పలు సూచనలు

- మనం అన్నదాతలను గౌరవించాలి.
- రైతుకు బతుకుపై భరోసా కల్పించాలి.
- పెట్టిన పెట్టుబడులు తిరిగి రాబట్టుకునే పరిస్థితులు ఉండాలి.
- పండిన పంటలకు లాభసాటి ధరలు కల్పించాలి. రైతులకే ధరల నిర్ణయాధికారం ఇవ్వాలి.
- రుణ సౌకర్యం కల్పించాలి.
- రైతు బీమాతో పాటు పంట బీమా కూడా అమలు చేయాలి.
- రైతుల పిల్లలకు రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించాలి.
- అభివృద్ధి పేరిట రైతుల నుంచి బలవంతంగా పంట పొలాలను తీసుకోకూడదు.
- ఆత్మహత్యలను నివారించాలి. బలవన్మరణాలకు పాల్పడితే ఆ కుటుంబం ఎట్లా నష్టపోతుందో అవగాహన కల్పించాలి.
- రైతులు పంట ఉత్పత్తులు విక్రయించేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.
- నకిలీ విత్తనాలను అరికట్టాలి.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిజమైన రైతులకు అందించాలి.
- వ్యవసాయ భూములు కచ్చితంగా వ్యవసాయదారులే కొనుగోలు చేసేలా చట్టాలు తీసుకురావాలి.
- వ్యవసాయ రంగంపై పార్లమెంట్, అసెంబ్లీలు ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలి.

రణ భూమిని నిశ్శబ్దం ఆవరించింది
రుణ శేషం ఇంకా మిగిలే వుందని
ఆయుధాలకు తెలియదు కాబోలు
మౌనం మీదేసుకొని కునుకు తీసాయి

ప్రకృతి చల్లబడిపోయినా
ఎక్కడో ఒకచోట లీలగా మూలుగ
వినిపిస్తూనే వుంటుంది

లోయలన్నీ స్తబ్దుగా వుండిపోయినా
ఏదో ఒక పక్క పొగ వాసన
యుద్ధాన్ని గుర్తుచేస్తూ వుంటుంది
ప్రస్తుతానికి ప్రాంతం చప్పబడినా
ఎక్కడో ఒక పక్క
దేహపు ఛాయ కనిపిస్తూనే ఉంటుంది
యుద్ధ విరమణే గానీ
పగిలిన రాతి గుర్తు
గుండెను తడుతూనే వుంటుంది

అతివల నుదుటిపై సిందూరం
ప్రతీకారపు జ్వాలాగ్ని
నిరంతరం రగులుతూనే ఉంటుంది
మదమెక్కిన మనసు
ముడుచుకొని కూర్చోదు
మరింపించి మారణహోమానికి
పదును పెడుతూనే వుంటుంది

మౌనంలోనే
మూడో కన్ను గురిపెట్టి మాడకపోతే
మరో క్షిపణి విరుచుకుపడుతుంది
ఇప్పుడక్కడ
యుద్ధపు గురుతులు చెరిగిపోలేదు
ఇప్పుడు అంతటా నిశ్శబ్దమే కావచ్చు
శత్రుమూక తోక జాడించక ముందే
ఆయుధాలను తట్టిలేపాలి
సిందూరం భారతావని నుదుటిపై
వీరతిలకమై మెరవాలి

రణస్థూపం

నరెద్దుల రాజారెడ్డి
96660 16636

కగార్ వేట అమానవీయం

> ఆకుపచ్చని అడవులు ఎరుపెక్కుతున్నాయ్. గుట్టల నడుమ తుపాకులు గర్జిస్తున్నాయ్. ఉనికిని కాపాడుకోవడానికి మావోయిస్టులు పోరాడుతుంటే.. అసలు మావోయిస్టు అనే మాటే లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఫలితంగా ఎన్‌కౌంటర్ అనే మాట సర్వసాధారణమైపోయింది. ఇప్పుడు మనం దేని గురించి మాట్లాడుతున్నామో అర్థం అయ్యింది అనుకుంటా. అదే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'ఆపరేషన్ కగార్'.

పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

దేశంలో మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రం తీసుకువచ్చిన కార్యాచరణే 'ఆపరేషన్ కగార్'. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా వారిని ఏరివేయడం కోసం కేంద్రప్రభుత్వం ఈ ఆపరేషన్‌ను ప్రారంభించింది. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొన్నాళ్లుగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లు సంచలనంగా మారాయి. ఎదురుకాల్పుల్లో వందలాది మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవులు కాల్పుల మోతతో హోరెత్తగా.. తాజాగా భూపాలపల్లి సరిహద్దుల్లోని కరైగుట్టల్లోనూ తుపాకుల గర్జన వినిపించింది.

> మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌ను వేగవంతం చేస్తూ.. వేల మంది పోలీసు, కేంద్ర బలగాలు కరైగుట్టలను చుట్టుముట్టాయి. ఎన్‌కౌంటర్లలో పలువురు మావోయిస్టులు చనిపోయినట్టు తెలుస్తున్నది. తెలంగాణలోని ములుగు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవుల్లోని ఎత్తయిన కరైగుట్టల్లో మావోయిస్టుల కోసం 21 రోజులపాటు ఆపరేషన్ కగార్‌ను నిర్వహించారు.

ఈ వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ తెరపైకి వస్తున్నది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఆపరేషన్ కగార్ పొలిటికల్ టర్న్ తీసుకున్నది. దండకారణ్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ గట్టిగా డిమాండ్ చేస్తున్నది. ఈ ఆపరేషన్‌ను గిరిజనులు, యువతపై జరుగుతున్న హింసాత్మక దాడిగా మానవ హక్కుల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదికగా పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. కగార్ పేరిట గిరిజనుల ఊచకోత తగదని ఆవేదన వ్యక్తం చేశారు. 'కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట యువకులు, గిరిజనులను ఊచకోత కోస్తున్నది. అది ధర్మం కాదు. నక్సలైట్లు ప్రతిపాదన పెడుతున్నరు. మేము ప్రభుత్వం దగ్గరికొచ్చి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నమని అంటున్నరు. నేను కేంద్రాన్ని కోరుతున్నా... బలం ఉంది కదా అని చంపుకొంటూ పోవడం సరికాదు. అది ప్రజాస్వామ్యం కాదు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయండి. నక్సలైట్లను పిలిచి డెమోక్రటిక్ స్పేస్ ఇచ్చి చర్చలు జరపండి. వాళ్లేం మాట్లాడుతరో మాడండి. అది గూడ నల్లనా, తెల్లనా దేశం ముందటికి రానీయండి. అట్ల కాదు, మొత్తం నరికి పారేస్తం, కోసి పారేస్తం అంటే ఎలా? మిలటరీ మీ దగ్గర ఉన్నది కాబట్టి కొడతరు. కానీ, అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఉత్తరం రాసి ఈ మాటను ఢిల్లీకి పంపిద్దామా? మీరంతా చప్పట్లు కొడితే తీర్మానంగా భావించి కేంద్రానికి పంపిద్దాం' అంటూ ఎల్కతుర్తి వేదికగా కేసీఆర్ పిలుపునిచ్చారు.

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఏప్రిల్ 21న 'ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్ (కరైగుట్టలు)' ప్రారంభమైంది. మూడు వారాల్లో 28 సార్లు ఎదురుకాల్పులు జరిగినట్టు సమాచారం. 31 మంది మావోయిస్టులు మృతిచెందగా, 18 మంది జవాన్లకు గాయాలైనట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో శాంతి చర్చలకు తమ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. చర్చలకు కేంద్రంలోని మోదీ సర్కారు సిద్ధంగా ఉందో, లేదో? స్పష్టం చేయాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ లేఖ ద్వారా ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి శాంతి చర్చలు జరపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రజాస్వామిక వాదులు, శాంతికాముకులు, అంతర్జాతీయ విప్లవ ప్రజాస్వామిక శక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అయితే విపక్షాలు, ప్రజల నుంచి ఆపరేషన్ కగార్‌పై వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతుందా, లేదా? అనేది చూడాలి.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)



ఇండియా కూటమిలో అనిశ్చితి!

ఇండియా కూటమి చెక్కుచెదరకుండా ఉందని నేననుకోవడం లేదు. కూటమి భవిష్యత్తు కూడా అంత గొప్పగా ఏమీ కనిపించడం లేదు. ఒకవేళ ఇప్పటికీ కూటమి చెక్కుచెదరకుండా ఉంటే మాత్రం నేను సంతోషిస్తా. కానీ, ఆ పరిస్థితులు లేవు. ఇండియా కూటమిలో అనిశ్చితి కనిపిస్తున్నది.

- పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత